క్లుప్తంగా

ఇంటర్వ్యూలు పూర్తి



మహదేవపూర్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మైనారిటీ లోన్ల యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఎంపీడీఓ రవీంద్రనాథ్ తెలిపారు. మహదేవపూర్ మండలం నుంచి 145 మంది దరఖాస్తు చేసుకోగా 85 మంది ఇంటరూవ్యూలకు హాజరైనట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సరైన సమాచారం ఇవ్వలేదని కొందరు అభ్యర్థులు తెలిపారు. ఈ ఇంటరూవ్యూలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ లక్ష్మారెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పరమేష్, ఎంపీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



మహాముత్తారం: మండలంలోని మాదారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు మంగళవారం రికార్డులను పరిశీలించారు. గ్రామంలో క్రమంతప్పకుండ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాడి కృష్ణవేని తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టేకుమట్ల(రేగొండ): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలపాలైన సంఘటన రేగొండ మండలంలోని చెన్నాపూర్ ప్రధాన రోడ్డులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గణపురం మండల కేంద్రానికి చెందిన శెట్టి శివ అనే వ్యక్తి పరకాలకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రూపిరెడ్డిపల్లిలో అదే గ్రామానికి చెందిన నాగపూరి బాబు ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలైయ్యాయి. కాగా స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పరామర్శ



కాటారం: మండలంలోని ధన్వాడలో మంగళవారం తుల్సెగారి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పుట్ట మధు వెంట జిల్లా యూత్ నాయకుడు జక్కు రాకేశ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కేసు నమోదు

టేకుమట్ల(రేగొండ): కులం పేరుతో దూషిస్తూ, దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలంలోని మడ్తపల్లికి చెందిన కొయ్యడ రఘుపై అదే గ్రామానికి చెందిన సూర సుధాకర్ దాడి చేయడంతో పాటు, కులం పేరుతో దూషించాడు. ఈ మేరకు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



కాటారం: కేక్ కట్ చేస్తున్న నాయకులు

కాటారం: జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు జోడు శ్రీనివాస్, కొండగొర్ల వెంకటస్వామి, పంతకాని సడ్వలి పాల్గొన్నారు.

పలిమెల: జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి పుట్టిన రోజు సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి మంగళవారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని పంకెనలో బీఆర్‌ఎస్ యూత్, మహిళా నాయకుల ఆధ్వర్యంలో శ్రీహర్షిణి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

సిద్ధమవుతున్న మొక్కలు

- గ్రామాల్లోని నర్సరీల్లో పెంపకం
- వేసవిలో కూలీలకు ఉపాధి
- హరితహారంలో నాటేందుకు అధికారుల ఏర్పాట్లు



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మొగుళ్లపల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. ప్రతీ గ్రామం పచ్చగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ప్రారంభించింది. అందులో భాగంగా మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో గ్రామస్తులను మొక్కల పెంపకంపై సమాయత్తం చేశారు. ఒక్కో నర్సరీలో పది వేల మొక్కలు పెంచేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

నర్సరీలు సిద్ధం

ఎరువులు, ఎర్రమట్టితో మొక్కలను పెంచడానికి నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామ అవసరాలకు అనుకూలంగా టేకు, పండ్ల మొక్కలు జామ, దానిమ్మ, నిమ్మ, కరివేపాకు, గోరింటాకు తదితర మొక్కలను పెంచుతున్నారు. మండలంలో సుమారు 3 లక్షల మొక్కలను పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కూలీలకు ఉపాధి

వేసవిలో పనులు దొరకక రోజువారి కూలీల జీవనోపాధి కష్టతరంగా మారింది. ఈ సమయంలో నర్సరీల ఏర్పాటుతో ఆయా గ్రామాల్లోని కూలీలకు ఉపాధి లభించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నర్సరీలో రోజు కనీసం 10 మంది కూలీలు పని చేయాల్సి ఉంటుంది. వారికి ఉపాధిహామీ పథకం ద్వారా వారం లేదా 15 రోజులకు ఒకమారు కూలి చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు, సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

> **నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నాం..**
>
> 
>
> ఈ ఏడాది హరితహారం కార్యక్రమం కోసం మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ నర్సరీలతో పలువురికి ఉపాధి లభిస్తుంది. నర్సరీల్లో పండ్లు, నీడ నిచ్చే మొక్కలను పెంచుతున్నాం.
>
> \- కృష్ణవేణి, ఎంపీడీఓ

ముస్లింలకు ప్రభుత్వం పెద్దపీట



చిట్యాల: కానుకలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



మహదేవపూర్‌లో..

చిట్యాల: ముస్లింలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా కానులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాడని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అన్ని మతాల పర్వదినాలకు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమన్, మండల కోఆప్షన్ సభ్యులు రాజ్ మహ్మద్, స్థానిక సర్పంచ్ ఇరుకులపాటి పూర్ణ చందర్‌రావు, పాల్గొన్నారు.

మహదేవపూర్: ముస్లింల పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ రాణిబాయి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన రంజాన్ తోఫాను మండలంలోని 400 మంది ముస్లిం మండలకేంద్రంలో మంగళవారం ఆమె అందించారు. అనంతరం మాట్లాడుతూ.. రంజాన్ పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. ఉపవాస దీక్ష ముగించుకొని రంజాన్ పండుగా జరుపుకునే ముస్లింకు సీఎం కేసీఆర్ తోఫా పంపించడం హర్షించదగిన విషయమన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు పుష్పలత లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ చల్ల రమణతిరుపతిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మసూద్ అహమ్మద్, సర్పంచ్ పద్మ రవీందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



చెరువును పరిశీలిస్తున్న ఐబీ ఏఈ చందు

టేకుమట్ల(రేగొండ): మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ బోర్డు ఏఈ చందు తెలిపారు. రేగొండ మండలంలోని రేపాక, రూపిరెడ్డిపల్లి చెరువులు, కుంటల్లో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న సంఘటనపై మంగళవారం 'సాక్షి'లో 'అక్రమంగా మొరం తవ్వకాలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇరిగేషన్ బోర్డు అధికారులు తవ్వకాలు చేపడుతున్న కుంటలు, చెరువులలో పరిశీలించారు. అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రెవెన్యూ అధికారులు అక్రమ మొరం తవ్వకాలు జరుగకుండా పర్యవేక్షించాలని కోరినట్లు ఏఈ చందు తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పువ్వాటి రాణి కోరారు. మండలంలోని గుంటూరుపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కంటివెలుగు శిబిరంలో పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సమస్యల ఆధారంగా మందులు, అద్దాలు పంపిణీ చేసి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు, సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదాయ వనరుగా ఆయిల్‌పామ్



మాట్లాడుతున్న సంజీవరావు

టేకుమట్ల(గోరికొత్తపల్లి): ఆదాయ వనరుగా ఆయిల్‌పామ్ పంటను ఎంచుకుని రైతులు అధిక లాభాలను పొందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు అన్నారు. మంగళవారం గోరికొత్తపల్లిలో ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల పంటలో మూడు సంవత్సరాల వరకు అంతర పంటలను వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. అంతర పంటల సాగుకు సైతం ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యాణ శాఖ అధికారి సునీల్‌కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్‌గా కుమార్



నియామక పత్రం అందజేస్తున్న రమేష్

టేకుమట్ల: తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్‌గా మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన దానవేన కుమార్‌ను నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జి రమేష్ మంగళవారం తెలిపారు. తనపై నమ్మకంతో భాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడికి కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండల కేంద్రంలో ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం నుంచి కాంగ్రెస్ పార్టీ భిన్నత్వంలో ఏకత్వం కోరుకుందని అన్ని మతాల సంక్షేమమే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారని తెలిపారు. హిందూ ముస్లిముల ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ రఘువీరారెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, పోల్నేని లింగారావు, రఫీ, సుకూర్, మొహినోద్దిన్, మొండిసాహెబ్, సుబాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

పలిమెల: మండలంలోని నీలంపల్లిలోని నర్సరీని ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కల మధ్య వచ్చే కలుపును ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఖాళీ బ్యాగుల్లో మళ్లీ గింజలు నాటాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీటర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): గ్రామాల్లో సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో సర్పంచ్ నడిపెల్లి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల వల్ల గ్రామస్తులు ధైర్యంగా ఉండవచ్చని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం కావున ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాలను ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. త్వరలోనే మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలో అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, వ్యాపారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కిష్టరావుపేటలో మట్టి దొంగలు!

మహదేవపూర్: మండలంలోని ఏన్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల కిష్టరావుపేట శివారు చెరువులో మట్టి దొంగలుపడ్డారు. సోమవారం రాత్రి కొంత మంది అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేని జేసీబీతో రాత్రి ట్రాక్టర్లతో దంతెలగడ్డ చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలింపు చేపట్టారు. గమనించిన కిష్టరావుపేట యువకులు అక్కడు వెళ్లి అడ్డుకోవడంతో నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖల అనుమతులు ఉన్నాయని బుకాయించినట్లు తెలిసింది. దీంతో నమ్మకం కలగని ఆ యువకులు నిలదీశారు. దీంతో రాత్రి రాత్రికి రాత్రే అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిసింది. పెద్దంపేటతో పాటు పలు చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపట్టిన ఎవరూ ఇలా అడ్డుకోలేదని యువకులనే తిరిగి ప్రశ్నించినట్లు సమాచారం. రాత్రి వేళ కావడం, చెరువు ప్రాంతం ఊరికి దూరంగా ఉండటంతో అక్రమంగా మట్టితరలింపులు చేస్తున్నారని అధికారులు అక్రమార్కులును గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తరలింపును యువకులు అడ్డుకున్న వీడియో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యింది. కాగా మట్టి తరలింపునకు పాల్పడిన వ్యక్తులు సమీప గ్రామానికి చెందిన వారేనని గుసగుసలు వినిపిస్తున్నాయి.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల(రేగొండ): ఇటీవల జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన జోడో యాత్రకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్న భాదావత్ చందు అనే కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు రేగొండ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రూ.1లక్ష ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి రఘువీరారెడ్డి, మండల నాయకులు గూటోజు కిష్టయ్య, గుగులోతు వీరునాయక్, తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం-గుండ్రాత్‌పల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడి చేసి రూ.3,800ల నగదు, ఒక ఆటో, రెండు టూవీలర్స్, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు, మరో ఆరుగురు పారిపోయినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారు మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందినవారని తెలిపారు.

కళాప్రదర్శన బృందానికి విరాళం



విరాళం అందజేస్తున్న చల్ల నారాయణరెడ్డి

మహాముత్తారం(మల్హర్): మండలంలోని తాడిచర్ల గ్రామంలో మంగళవారం శ్రీ లవకుశ యక్షగాన నాటిక కళాప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కాటారం పీఏసీఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టెంకాయ కొట్టి కళాప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం యక్షగాన నాటిక కళాబృందానికి రూ.5వేల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డ అనంతరం కేసీఆర్ ప్రభుత్వం జానపద జానపద కళాకారులకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచినందుకు గ్రామస్తులకు కళాబృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం మాజీ జెడ్పీటీసీ దుర్గం మల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రపంచానికి చాటిచెప్పేలా ఉత్సవాలు



బొమ్మల దుకాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి

వెంకటాపురం(ఎం): ప్రపంచానికి చాటిచెప్పేలా రామప్ప దేవాలయంలో వారసత్వ ఉత్సవాలు జరుగుతున్నాయని రాష్ట్ర గిరిజన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం రామప్ప ఆలయం ముందు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఆమె రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్‌రావు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, కలెక్టర్ కృష్ణా ఆదిత్యాతో కలిసి తిలకించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా 40 స్టాల్స్ ఏర్పాటు చేయగా బొమ్మల దుకాణం, లడ్డు ప్రసాదం తదితర స్టాల్స్‌ను పరిశీలించారు. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, మంత్రి సత్యవతిరాథోడ్‌లు ద్విచక్రవాహనంపై తిరుగుతూ ఆలయం ముందు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సభావేదిక వద్ద ప్రముఖ వాయిద్యా కళాకారుడు శివమణి డ్రమ్స్ ప్రత్యేకతను మంత్రికి వివరించారు. అనంతరం రామప్ప గార్డెన్‌లో మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలో తొలిసారిగా ప్రపంచ వారసత్వ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా యాత్రాంగం నిర్వహిస్తుందన్నారు. వేలాదిమంది హాజరయ్యే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వై.వీ గణేష్, ఆర్డీఓ రమాదేవి, డీపీఓ వెంకయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, మండల స్పెషల్ ఆఫీసర్ పిల్లి శ్రీపతి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శ్రీనివాస్ ఉన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

మహదేవపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ రాణిబాయి మంగళవారం అందజేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 15 మందికి షాదీముబారక్, ఐదుగురికి కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీటీసీ రమణ, సర్పంచ్ శ్రీపతి బాబు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు కోచ్‌లను నియమించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీవైఎస్‌ఓ బుర్ర సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 10కేంద్రాల్లో వివిధ క్రీడా అంశాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల కోచ్‌లు తమ పూర్తి వివరాలతో ఈ నెల 21వ తేదీ వరకు డీవైఎస్‌ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274